

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# సముద్రాల రాఘవాచార్య

## (విజయచిత్ర 1966, సెప్టెంబర్ సంచిక నుంచీ)



“ఫలానా పద్యం ఏ గ్రంథంలోది మాస్టారూ?” అని అడిగితే “ఫలానా గ్రంథంలోదిరా అబ్బాయీ” అని ఆలోచనకు కూడా ఆస్కారం ఇవ్వకుండా, ఠపీమని చెప్పగల జ్ఞాపకం, ప్రజ్ఞాగలవారు అరుదుగావుంటారు. అలాంటి అరుదైనవారిలో అరుదైనవారు రాఘవాచార్యులుగారు, ఆయన చదవని పుస్తకంగాని–ఎరగని గ్రంథంగాని, పఠించని పురాణంగాని, కంఠస్థం చెయ్యని కావ్యం గాని లేవు. ఆచార్యులుగారే ఒక గ్రంథాలయం ఒక నిఘంటువూనూ. సంస్కృతాంధ్రాల్లో ఆయనకు మంచి పాండిత్యమూ, పలుకుబడీ వున్నాయి.

ఆయన రచనచేసిన దాదాపు నూరు చిత్రాల్లోనూ పురాణాలు, సాంఘికాలు, జానపదాలు, చరిత్రలు – అన్నిరకాలూ వున్నాయి, వెయ్యికి పైగా రాసిన సినిమా పాటల్లో శృంగార, రౌద్ర, హాస్య, శౌర్య శోకాది నవరసాలూ వున్నాయి. “కవి అన్నవాడు ఏ ఒక్కటో రాయగలిగేవాడు కాదు. అన్నీ రాయగలడు–రాయాలి. అలా రాసిన వాడే కవి” అంటారాయన.

చలనచిత్రాల్లో_అందులోనూ పౌరాణిక చిత్రాల్లో మొట్ట మొదటిసారిగా వాడుక భాష వాడినవారు ఆచార్యులుగారు. ఆయన రచనచేసిన తొలిచిత్రం ‘కనకతార’లో వాడుక భాషలో సంభాషణలు రాస్తూవుంటే – నిర్మాతలు ముక్కు మీద వేలు వేసుకున్నారు. “ఇదేమిటి ఈ భాష ?” అనుకున్నారు. “ఇదే భాష, ప్రజల భాష. ‘కూర్చుందుడు – దయసేయుడు’ అనే గ్రంథపదజాలం సినిమాల్లో ఎందుకు? పదిమందికీ దగ్గరగా వుండే ‘దయచేయండి’ లాటి పదాలే వుండాలి” అని వాదించి – వ్యావహారిక భాషను ప్రవేశపెట్టారు సముద్రాలగారు.

1902 వ సంవత్సరం జూలై 19 వ తేదీన గుంటూరుజిల్లాలో వున్న రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో "పండితుల" ఇంట జన్మించారు రాఘవాచార్యులుగారు. ఆచార్యులుగారి తండ్రిగారూ, తాతగారూ సంస్కృతాంధ్రాల్లో పాండిత్యం సంపాయించినవారు. సరస్వతీదేవి ఇంట్లోనే సాక్షాత్కరించినందువల్ల ఆమె కటాక్షం రాఘవాచార్యులవారికి చిన్నప్పుడే కలిగింది !

రేపల్లె హైస్కూల్లో నాలుగోఫారం చదువుతున్నప్పుడు ఆయన కవిత్వం చెప్పడం ప్రారంభించారు. ఆయన సాహచర్యం అంతా పండితులతోనూ, కవులతోనే. బడిలో ఉపాధ్యాయులకు ఆయన 'ప్రియమైన విద్యార్థి' తెలుగుమాస్టారికి ఆచార్యులుగారంటే ఎంత అభిమానం వుండేదో అంత అభిమానమూ ఇంగ్లీషు మాస్టారికీ వుండేది. ఎంచేతంటే ఆయన ఇంగ్లీషులోనూ మంచి మార్కులే సంపాయించేవారు. 'స్కూలు ప్లేగ్రౌండు' ఎలా వుంటుందో ఆయనకు తెలియకపోయినా 'పాఠశాల వ్యాయామ సంఘానికి' ఆయనే కార్యదర్శి ! దీనికి కారణం మరేమీ లేదు కార్యదర్శిగా వుండ వలసిన వాడికి ముఖ్యంగా తెలివితేటలుండాలని, రాఘవాచార్యులు గారిని ఎన్నిక చేసుకున్నారు.

1918వ సంవత్సరంలో ఆచార్యులుగారికి 'అవధానం' అంటే ఏమిటో తెలిసి ఆ సాధనలో పడ్డారు. ఏ ఐదారుమైళ్ళ దూరంలోనో ఏ పండితుడైనా 'అవధానం' చేస్తున్నాడంటే చాలు ఆయన అక్కడికి పరిగెత్తారన్నమాటే.

స్కూలు ఫైనలు ఐపోయిన తర్వాత సముద్రాలగారు 'పాఠశాల చదువుకు' స్వస్తి చెప్పి 'అసలు చదువు' సాగించారు. స్వయంగా కృషిచేసి సంస్కృతాంధ్రాల్లో పాండిత్యం, ఆంగ్లభాషలో ప్రావీణ్యం సంపాయించారు. తర్వాత ఆయనకు గుంటూరుజిల్లా గ్రంధాలయ సంఘంతో బాగా సంబంధం ఏర్పడింది. అప్పుడే ఆయన, రోజుకు వెయ్యిపేజీల చొప్పున చదివి మొత్తం గ్రంధాలన్నీ – దాదాపు "బట్టీ" వేశారు.

రాఘవావాచార్యులుగారు ఉప్పు సత్యాగ్రహంలో కూడా పాల్గొన్నారు.

బెజవాడలో 'ఫ్రెండ్స్ అండ్ కో' అనే వ్యాపారసంస్థ ఒకటి వుండేది. ఆ సంస్థ అధిపతికి సాహిత్యాభిలాష ఎక్కువ, నాటకాల మీద మంచి మక్కువ. సాహిత్యంలో మంచి ప్రవేశం కూడా వున్నది. ఆచార్యులుగారు ఎవరితోనో ఒకనాడు ఆ కంపెనీకి వెళితే ఆ కంపెనీ యజమానికి ఆచార్యులుగారిని పరిచయంచేసి, ఆయనను రాఘవాచార్యులుగారికి పరిచయం చేశారు "వీరు గూడవల్లి రామబ్రహ్మం గారు. ఈ ఫ్రెండ్స్ అండ్ కో వీరిదే. రసహృదయులు" అని.

రామబ్రహ్మంగారు చలనచిత్రాలకు దర్శకత్వం వహిస్తారని గాని, రాఘవాచార్యులుగారు రచనలు చేస్తారనిగాని వాళ్ళెవరూ అప్పుడు వూహించి వుండరు! తర్వాత వాళ్ళిద్దరూ ఆ పన్లు నిర్వహించవలసిన యోగం వుండడంచేతే కాబోలు–వారిద్దరిమధ్య స్నేహం బాగా పెరిగింది. ఇద్దరూ కూచుని గంటల తరబడి సాహిత్య చర్చలు చేసేవారు. ఆ చర్చల్లో గూడవల్లిగారు వ్యాపారమూ, సముద్రాలవారు ప్రపంచమూ మరిచిపోయేవారు! అప్పుడు రాఘవాచార్యులగారి రచనలు తరచూ పత్రికల్లో పడుతూవుండేవి.

సాహిత్యాభిలాష వెనక్కుపోతుందనో ఏమో ఆచార్యులుగారు ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు. "మీ ఉద్యోగం ఏమిటండీ?" అని ఎవరైనా అడిగితే. "పుస్తకాలు చదువుకోవడం, ఏదేనా రాసుకోడం, మంచిచెడ్డలు తర్కించడం" అని సమాధానం చెప్పేవారాయన.

అప్పుడు గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షులుగా వుంటున్న జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారికి రాఘవాచార్యులగారంటే మంచి అభిమానం వుండేది. వీలైనప్పుడల్లా ఆయన్ను పిలిచి పద్యాలు చెప్పించుకుంటూ వుండేవారు. ఆచార్యులగారితోపాటు ఇంకొకాయన కూడా వచ్చి సాహిత్య చర్చల్లో పాల్గొనేవారు, ఆయన కొసరాజు రాఘవయ్యచౌదరిగారు !

కొన్నాళ్ళకు రామబ్రహ్మంగారు 'ఫ్రెండ్స్ అండ్ కో' ను మూసేసి – మద్రాసు వెళ్ళి 'సమదర్శిని' పత్రికలో సహాయ సంపాదకుడిగా చేరారు. తాపీ ధర్మారావుగారికి కూడా ఆ పత్రికతో సంబంధం వుండేది.

'కమ్మచరిత్ర' అనే విషయంమీద పరిశోధనలు చెయ్యడానికి కుప్పుస్వామి చౌదరిగారు, రాఘవాచార్యులుగారిని మద్రాసు విశ్వవిద్యాలయంలో వున్న ప్రాచీన లిఖిత పుస్తకభాండాగారానికి పంపించారు. ఆ పనిమీద వచ్చినప్పుడు ఆచార్యులుగారు 'సమదర్శిని' పత్రికతో కూడా కొంత సంబంధం

ఏర్పరచుకున్నారు. కారణాంతరాలవల్ల ఆ పత్రిక ఆగిపోవడంతో రామబ్రహ్మంగారు బెజవాడ, పరిశోధన పూర్తికావడంతో రాఘవాచార్యులుగారు గుంటూరూ చేరుకున్నారు.

రామబ్రహ్మంగారూ, ఆచార్యులు గారూ తర్వాత 'ప్రజామిత్ర' లో పనిచేశారు. ఆ పత్రిక అప్పుడు బెజవాడ నుంచి వెలువడేది. ఏవో ఇబ్బందులొచ్చి ఆ పత్రిక ఆగిపోతే – సముద్రాలగారూ, గూడవల్లి గారూ మద్రాసు వచ్చి 'ప్రజామిత్ర'ను రాజకీయ వారపత్రికగా ప్రారంభించారు. ఇది 1934 లో. అప్పడే బి.యన్.కె.ప్రెస్ వెలిసింది – 'ప్రజామిత్ర' అక్కడే అచ్చయేది.

తర్వాత రామబ్రహ్మంగారి మనసు సినిమాలమీదికి మళ్ళడం 'ద్రౌపదీ వస్త్రాపహరణం' చిత్రంతో ఆయనకు కొంత సంబంధం ఏర్పడడం జరిగాయి. రాఘవాచార్యులుగారికి బి. యన్. రెడ్డి. నాగిరెడ్డిగార్లతో పరిచయం ఏర్పడింది.

"కనకతార" చిత్రానికి రామబ్రహ్మంగారు ప్రొడక్షన్ డైరెక్టరుగా ఉండేవారు. చిత్రానికి రచయిత ఎవరా అని మీమాంస వచ్చింది. "రాఘవాచార్యులవారితో రాయిద్దాం" అన్నారు రామబ్రహ్మం.

రామబ్రహ్మంగారి ప్రోద్బలంవల్ల రాఘవాచార్యులుగారు "కనకతార" చిత్రానికి మాటలూ, పాటలూ, పద్యాలూ రాశారు. ఇది ఆయన మొదటి చిత్రం. సినిమా రచయితగా ఆచార్యులుగారు అలా పరిచయమైనారు. ఆ చిత్రం బాగా ధనార్జన చేసింది. ఆయన ప్రవేశపెట్టిన వ్యావహారిక భాష అందరికీ నచ్చింది.

హెచ్. ఎం. రెడ్డిగారు, బి. యన్. రెడ్డిగారూ 'రోహిణీ' సంస్థ స్థాపించి _ 'గృహలక్ష్మి' నిర్మాణానికి పూనుకొని – రాఘవాచార్యులుగారిని రచయితగా తీసుకున్నారు. ఈ చిత్రం సాంఘికం ! ఐతేనేం అదేమాత్రం ఇబ్బంది అనిపించలేదు సముద్రాలగారికి.

తర్వాత వాహినీసంస్థ వెలియడం తో ఆచార్యులుగారు 'వాహినీ'లో చేరి 'వందేమాతరం' 'సుమంగళి' 'దేవత' 'పోతన' 'స్వర్గసీమ' 'వేమన' చిత్రాలకు రచన చేశారు.

1950 లో వినోదా పిక్చర్స్ సంస్థలో 'భాగస్వామి' గా చేరి 'స్త్రీ సాహసం' 'శాంతి' 'దేవదాసు' చిత్రాలు రాశారు. ఆయన ఒక్క పాటలే రాసిన మొదటి చిత్రం జెమినీవారి 'జీవన్ముక్తి'.

రాఘవచార్యులు గారి పెద్ద అబ్బాయి రామానుజాచార్యులు 'మాయలోకం' చిత్రంలో తండ్రిగారికి సహాయపడ్డారు అందులో కొన్ని పాటలు కూడా రాయడంతో 'సినిమా'ల్లో ఆయన కూడా రచయితగా పరిచయమైనారు. ఆయనే సముద్రాల జూనియర్.

1962వ సంవత్సరం జులై 18 న ఆచార్యులుగారికి వైభవంగా మద్రాసులో 'షష్టిపూర్తి' మహోత్సవం జరిగింది.

సముద్రాలగారు చిత్రాలకు కేవలం రచన మాత్రమే చెయ్యలేదు. కొన్నింటికి దర్శకత్వం కూడా వహించారు. 'వినాయక చవితి' 'భక్త రఘునాథ్' 'బభ్రువాహన' చిత్రాలు ఆయన దర్శకత్వంలో తయారైనవి.

ఇప్పుడు ఆయన–చిన్నీ బ్రదర్స్ వారి 'సుమతి' యస్.యమ్. యస్. వారి 'గోరాకుంభార్' తారక రామావారి 'కృష్ణావతారం' మాధవీ వారి సాంఘిక చిత్రాలకు రచన చేస్తున్నారు.

"సినిమాలలో జన సామాన్యానికి అర్థం కాని పద్యాలను జొప్పించడంలో అర్థంలేదు. ప్రయోజనం అంతకన్నా లేదు. ఆ పద్యం చివర జరిగే 'రాగాలాపన' కూడా రసోత్పత్తికి భంగం కలిగిస్తుంది. కోపంతోనూ యుద్ధాల్లోనూ వాదనల్లోనూ పద్యాలు చదవడం నాకేమాత్రం నచ్చదు. ఐతే దర్శకులు, నిర్మాతలూ కావాలంటారు కాబట్టి – తప్పడం లేదు. ఐతే – నా ఉద్దేశంలో ఇవి శుద్ధ అనవసరం అని. ఎంచేతంటే ఆ పద్యంలో వున్న భాషగాని, భావంగాని ఎంతమందికి అర్థమవుతుంది ? పైగా పద్యాల్లో వాదించుకోవడం కూడా ఏమంత మంచి పద్ధతి ?" అంటారాయన.

"పురాణ కథల్లో లేని విషయాలను మేము చిత్రాల్లో ప్రవేశ పెడుతున్నామని, లేని పాత్రలను సృష్టిస్తున్నామని అంటారు. ఇది నిజమే ఐనా సమర్థనీయం. ఎంచేతంటే పురాణంలో వున్న విషయాన్ని తెరమీద చెప్పడానికి గాని, రాయడానికి గాని కొంత 'డ్రామా' అవసర మవుతుంది. ఆయా పాత్రల ఔచిత్యానికి భంగం కలగకుండా – అసలు కథలోని పాత్ర పోషణకు దెబ్బ తగలకుండా చేస్తే ఏమీ తప్పులేదు. అది వాంఛనీయం కూడా ! మహాభారతంలో వున్న 'శకుంతల' కథను తీసుకుని కాళిదాసు నాటకంగా రాపినప్పుడు 'నాటకీయత' కోసం మూలంలో లేని మార్పులు కొన్ని చేశాడు. నాయకుడైన దుష్యంతుని పాత్రను ఉదాత్తంగా చిత్రించడానికని – కాళిదాసు నాటకంలో 'శాపం' విషయాన్ని ప్రవేశ పెట్టాడు. ఇలా ఔచితికి భంగం రానీయకుండా జనరంజకం చెయ్యడానికి కవులు ఇటువంటి స్వాతంత్ర్యాన్ని తీసుకున్నారు. 'రామాయణం' రాసిన మహా కవులు కూడా 'వాల్మీకి రామాయణంలో లేని ఘట్టాలను ప్రవేశ పెట్టారంటే. కారణం ఇదే ! 'కథ'లో ఒకలా వుండే 'కథ'ను తెరమీద గాని, రంగంమీద గాని చెప్పడానికి ప్రయత్నం చేసినప్పుడు — 'డ్రెమటిక్'గా వుండాలి. మానవ హృదయ ప్రవృత్తులు ఇప్పుడెలా వున్నాయో, అప్పుడూ అలాగే వుండేవి. అంచేత, రసభంగం చెయ్యని మార్పులు – ఎంతో అవసరమైతే తప్ప – కవులు చేస్తూనే వున్నారు – చెయ్యాలి కూడా."

"సినిమా స్క్రిప్టు ముందే సిద్ధం చేసుకోవడం అన్నది చాలా మంచి పద్ధతి. కావలసినది ఏమిటో అనుకుని, విపులంగా చర్చించుకుని క్షుణ్ణంగా అర్థం చేసుకుని రాసుకున్నాక – మళ్ళీ మార్పులు అనేవి అవసరం కావు. స్క్రిప్టు మీద నమ్మకం లేకపోయినప్పుడే – అడుగడుక్కీ మార్పులు అవసరం అనిపిస్తూ వుంటాయి. అందుకనే ముందే నమ్మకం సంపాదించుకోడానికి — చక్కగా చర్చించుకుని "ఇదీ" అనుకోవాలి. నేను పని చేసిన దర్శకులలో ఈ పద్ధతిని అనుసరించి క్షుణ్ణంగా 'స్క్రిప్టు' చర్చించి ముందే రాయించిన వాళ్ళలో శ్రీ కె. వి. రెడ్డి, శ్రీ యన్. టి. రామారావు ముఖ్యులు!" అన్నారు ఆచార్యులుగారు. 'వెండి పెట్టె'లో వున్న తమలపాకులు తీసి, 'తాంబూలం' వేసుకుంటూ.

★★★

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS